సాక్షి
నల్లగొండ
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



భక్తుల రద్దీ సాధారణం
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. - 10లో



దేశం కంటే అమ్మ గొప్పది
దేశం కంటే అమ్మ గొప్పదని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. - 10లో



ముగిసిన సదస్సు
మిర్యాలగూడ పట్టణంలో నిర్వహిస్తున్న చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు ముగిసింది. - 10లో

న్యూస్‌రీల్

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



పుష్కరఘాట్‌ను శుభ్రం చేస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని, మహిళలు

కనగల్ : పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని డీఆర్‌డీఓ కాళిందిని అన్నారు. ఆదివారం కనగల్ మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయం వద్ద పుష్కరఘాట్‌ను, డ్రెయినేజీలు, రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం ఆలయం వద్ద ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వీబీకేలు, సంఘంబంధం మహిళలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ) : అక్టోబర్ 4న హైదరాబాద్ దోబీఘాట్‌లో జరగనున్న ఉప కులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఉప కులాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గద్దం యాదగిరి కోరారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద సభ పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ ఉప కులాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియుద్దీన్, ఎస్టీ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్, ముంతాజ్ అలీ, రంగాపూరి యాదయ్య, వంటిపాక యాదగిరి, కట్టెల శివకుమార్, కంబాలపల్లి శ్రీకాంత్, పెరిక అభిలాష్ పాల్గొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధులు

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులతోపాటు మహారాష్ట్రలోని పూణే నుంచి బౌద్ధులు వచ్చారు. వీరు బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. జాతక కథల పార్కు, స్థూపపార్కు, శ్రీలంక దేశీయులు ఏర్పాటు చేసిన 40 అడుగుల బుద్ధుడు, తపోవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంపై చెక్కిన శిల్పాలను, మహాస్థూపం రెండవ అంతస్తులో గల అష్ట బుద్ధులను సందర్శించారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోగల బుద్ధుడి చరిత్రకు సంబంధించిన విగ్రహాలతో పాటు చైత్యాలు, మహాబోధి వృక్షం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరికి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధుని గురించి వివరించారు.

అన్యాయాన్ని అరికట్టాలి

మిర్యాలగూడ : దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడంతోపాటు దళితుల స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య కోరారు. ఆదివారం మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన శైలజ ఇంటి స్థలాన్ని ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకోవడంతో న్యాయం కోసం ఉన్నతాధికారులను కలిసినప్పటికీ ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించగా కేసు నమోదైందని తెలిపారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ అధికారులు నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేయడం ఎంతవరకు సబబు అన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అధికారులను పక్కదోవ పట్టించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వజ్రగిరి అంజయ్య, వంగూరు జయమ్మ, సుధీర్, వల్లంపట్ల రాములు, ప్రణవ్, దేవదానం ఉన్నారు.

ప్రజల్లేని ఊరు.. తిమ్మాపూర్

- 60 ఏళ్లపాటు అక్కడ నివాసమున్న ఐదు కుటుంబాలు
- వివిధ కారణాలతో చుట్టుపక్కల ప్రాంతాలకు వలస
- నేడు పాడుబడ్డ ఇళ్లు, పశువుల కొట్టాలు దర్శనం
- రెవెన్యూ గ్రామంగా రికార్డుల్లో నమోదు
- అధికారుల పర్యవేక్షణలో భూ సంబంధ కార్యక్రమాలు



తిమ్మపూర్ గ్రామంలో పాత ఇల్లు

కట్టంగూర్ : రికార్డుల్లో రెవెన్యూ గ్రామమైన తిమ్మాపూర్‌లో నేడు ఒక్కరూ నివాసం లేకపోవడంతో ప్రజలు లేని పల్లెగా మారింది. 70 సంవత్సరాల క్రితం వ్యవసాయబావుల వద్ద ఐదు కుటుంబాలు (వంగాల మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీరాంరెడ్డి, మధూసరెడ్డి, కుమ్మరి నర్సింహ) ఇళ్లు నిర్మించుకొని 60 సంవత్సరాల పాటు తిమ్మాపూర్ గ్రామంలో జీవనం సాగించారు. కాలక్రమంలో అంటువ్యాధులు ప్రబలి కొందరు ఊరు వదిలి పోగా మరికొందరు ఉపాధిని వెతుక్కుంటూ నెమ్మాని, పరడ, హైదరాబాద్, కరీంనగర్, నల్లగొండ, ఏపీ లింగోటం, నార్కట్‌పల్లి, చిట్యాల, వెంకటేశ్వర్లబావి, శేరిబావి వంటి గ్రామాలకు వెళ్లి నివసిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పాడుబడిన ఇళ్లు, బావులు, పశువుల కొట్టాలు, గోడలు, పంట పొలాలు మాత్రమే దర్శనమిస్తాయి. ఇలాంటి గ్రామాన్ని బేచిరాక్‌గావ్ (దీపం వెలగని గ్రామం)గా పిలుస్తుంటారు.

గతంలో ఐదు కుటుంబాలు నివాసం..

2011 జనాభా లెక్కల ప్రకారం తిమ్మాపూర్ గ్రామంలో 5 కుటుంబాలు నివసించేవి. గ్రామం మొత్తం జనాభా 20 మంది వారిలో 12 మంది పురుషులు, 8 మంది స్త్రీలు ఉన్నారు. వీరిలో 9 మంది కూలీ పనులు చేసేవారిలో 8 మంది పురుషులు, ఒక స్త్రీ ఉన్నారు. 55.56 శాతం అక్షరాస్యత కలిగిన గ్రామంలో ఇద్దరు మాత్రమే ఓటర్లు ఉండటం విశేషం.

ఆంజనేయస్వామి విగ్రహం తరలింపు

తిమ్మాపూర్‌లో గల ఆంజనేయస్వామి దేవాలయంలో గ్రామ ప్రజలు ఆంజనేయస్వామికి పూజలు చేసేవారు. అంటు వ్యాధులు ప్రబలడంతో గ్రామస్తులంతా ఒకరు తరువాత ఒకరు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో గ్రామమంతా ఖాళీ అయ్యింది. దీంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం గ్రామస్తులు తీసుకెళ్లి ఆలయం నిర్మించి ప్రతిష్ఠించుకున్నారు.

నెమ్మానిలో ఉంటున్నాం



పరడ, నెమ్మాని గ్రామాల మధ్య తిమ్మాపూర్ ఉంటుంది. అక్కడే ఐదు కుటుంబాలు నివసించేవి. చుట్టూ చెట్లు కొండలతో అడవిని తలపించేలా ఉండేది. మా తాత, నాన్న అందరం 60 సంవత్సరాల పాటు జీవనం సాగించాం. ఇప్పుడు నార్కట్‌పల్లి మండలం నెమ్మానిలో నివాసం ఉంటున్నాం. పాస్ పుస్తకాల్లో రెవెన్యూ గ్రామం తిమ్మాపూర్, కట్టంగూర్ మండలం అని ఉండడంతో నార్కట్‌పల్లిలో ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఇబ్బంది అవుతోంది.

– వంగాల అనంతరెడ్డి, రైతు, నెమ్మాని

తిమ్మాపూర్ పరిధిలో 500 ఎకరాలు..

కట్టంగూర్ మండలంలో 22 గ్రామ పంచాయతీలకు గాను 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటిలో ఒకటి తిమ్మాపూర్. ఈ ఊరి పేరుతో రెవెన్యూ రికార్డుల్లో భూములు ఉన్నాయి. కానీ ఆ ఊరిలో వరిసాగు, చెట్లు, పక్షులు, గేదెలు, పశువులు, భూమి తప్ప జనం కనిపించరు. ఆ గ్రామం పేరుతో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తారు. వ్యవసాయ భూమి సాగు వివరాలు, ఇతర విషయాలు రికార్డుల్లో నమోదవుతాయి. గ్రామం రెవెన్యూ పరిధి కావడంతో సంబంధిత అధికారులే భూములను పర్యవేక్షిస్తారు. తిమ్మాపూర్ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 59లో 500 ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో సుమారు 180 మంది రైతులు పత్తి, వరి, పెసర, కంది పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంగా పచ్చని పొలాల మధ్య ఆహ్లాదకరంగా కనువిందు చేస్తుంది.



పడావుపడిన ఇల్లు

మున్సిపల్ కమిషనర్‌తో 26న ఫోన్ ఇన్

నల్లగొండ పట్టణంలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించింది. పట్టణంలో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలతో పాటు తాగునీటి ఇబ్బందులు, వెలగని వీధిదీపాలు తదితర సమస్యలను మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేది. 26.09.2023 మంగళవారం
ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు

డయల్ చేయాల్సిన నంబర్ : 70139 57178



రమణాచారి, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం

మిర్యాలగూడ : మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ (2023–25) పాలకవర్గం ఎన్నికలు ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగాయి. రైస్ మిల్లర్స్ అధ్యక్షుడిగా గౌరు శ్రీనివాస్ పేరును మిల్లర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ ప్రతిపాదించగా డాక్టర్ బండారు కుశలయ్య బలపరిచారు. నామినేషన్ల సమయం ముగిసే వరకు అధ్యక్ష స్థానానికి ఎవరూ పోటీ చేసేందుకు ముందుకు రాకపోవడంతో గౌరు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భోగవెల్లి వెంకటరమణచౌదరి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ చేయగా గుడిపాటి శ్రీనివాస్‌పై 05 ఓట్ల మెజారిటీతో గంట సంతోష్‌రెడ్డి గెలుపొందారు. రైస్ మిల్లర్స్ కార్యదర్శి(2) పదవికి రంగా లింగయ్య, మాశెట్టి శ్రీనివాస్, గుడిపాటి అప్పారావు పోటీ చేయగా మాశెట్టి శ్రీనివాస్‌పై 27ఓట్ల మెజారిటీతో రంగా లింగయ్య గెలుపొందారు. కోశాధికారిగా పైడిమర్రి సురేష్, చిల్లంచర్ల శ్రీనివాస్ పోటీ చేయగా పైడిమర్రి సురేష్‌పై చిలచర్ల శ్రీనివాస్ 21 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పది మంది కార్యవర్గ సభ్యుల కోసం 35 మంది పోటీ చేయగా డ్రా పద్ధతిలో కార్యవర్గ సభ్యులుగా గౌరు శంకర్‌రావు, రాయిని శ్రీనివాస్, బూరుగు సత్యనారాయణ, పబ్బతి కరుణాకర్ రావు, పైడిమర్రి రంగనాథ్, వెన్నె వెంకటకాశి రామారావు, ఓరుగంటి సత్యనారాయణ, గార్లపాటి శ్రీనివాస్, గార్లపాటి మధు, ఓరుగంటి రమేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కేఎస్ఎం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పందిరి రవీందర్ వ్యవహరించారు. మిల్లర్స్ ఎన్నికల్లో 85 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా నలుగురు విదేశీ పర్యటనలో ఉండడంతో 81 మంది ఓటు వేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, జిల్లా నాయకులు డాక్టర్ బండారు కుశలయ్య, రేపాల మధుసూదన్, రేపాల అంతయ్య, గార్లపాటి ధనమలయ్య తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌కు తగిన బుద్ధి చెబుతాం

నల్లగొండ టౌన్ : రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌కు అంగన్‌వాడీలు తగిన బుద్ధి చెబుతారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది ఆదివారం గడియారం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులను బెదిరిస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీ సిబ్బందిని వెంటనే ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, అద్దంకి నర్సింహ, సైదాచారి, కె.విజయలక్ష్మి, రత్నమాల, ప్రకృతాంబ, కె.సరిత, ప్రమీల, పార్వతి, కళ్యాణి, యాదమ్మ, సముద్రమ్మ, నాగమణి, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు సరికాదు

మునుగోడు, చండూరు : అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పోరాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోగా.. వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు, చండూరులో అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. స్వచ్ఛంద సేవ కుల్లా ఎన్నో రకాల పనులు చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాల డిమాండ్ చేశారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నలపరాజు సతీష్‌కుమార్, చాపల శీను, దొటి వెంకన్న, బండమీది వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు కేదారి, సునీత, రాధిక, రాజేశ్వరి, శోభ, తారక, జోతి, జగదీశ్వరి, నాగమణి, రమణమ్మ, శారద, జంగమ్మ, పార్వతమ్మ, ఉష, వనజ, అన్నపూర్ణ, లలిత, రాధిక, పారిజాత, ప్రమీల, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



చండూరు: మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి



నల్లగొండలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రూ.1400 కోట్లతో నల్లగొండ అభివృద్ధి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి నీలగిరిలో అభివృద్ధి పనుల పరిశీలన
- ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని పిలుపు



నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో సభా స్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్, నల్లగొండ రూరల్ : సీఎం కేసీఆర్ రూ.1400 కోట్లతో నల్లగొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 2న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నల్లగొండలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన.. కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌తో కలిసి కేటీఆర్ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ భవనం, పరిపాలన భవనం, పరీక్షల బ్రాంచ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనాలను ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మర్రిగూడ బైపాస్ జంక్షన్, ఐటీ హబ్, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, ఎన్జీ కళాశాలలో పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 2న మంత్రి కేటీఆర్ నల్లగొండలో సుమారు రూ.750 కోట్ల చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. ఎంజీయూలో ఇంజనీరింగ్ కళాశాల భవనం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, ఎగ్జామినేషన్ బ్రాంచ్, రూ.90 కోట్లతో ఐటీ హబ్, మర్రిగూడ బైపాస్ వద్ద రూ.118 కోట్లతో చేపట్టిన డివైడర్స్, లైటింగ్, జంక్షన్ అభివృద్ధి పనులను, రూ.10 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్ నాన్ వెజ్, ఫ్రూట్స్, ఫ్లవర్ మార్కెట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. రూ.87 కోట్లతో అంతర్గత రోడ్లు అభివృద్ధి పనులకు, క్లాక్‌టవర్ సెంటర్ వద్ద రూ.234 కోట్లతో చేపట్టనున్న కళాభారతి, ఉదయ సముద్రం ట్యాంక్ బండ్, వల్లభరావు చెరువు నెక్లెస్ రోడ్, ఐటీ హబ్ నుంచి ట్యాంక్ బండ్ రోడ్డు, ఛాయా సోమేశ్వర, పచ్చల సోమేశ్వర దేవాలయాల అభివృద్ధి పనులకు, రూ.216 కోట్లతో చేపట్టిన యూజీడీ పనులకు, రూ.56 కోట్లతో పట్టణంలో మిగిలిన ప్రాంతాలకు తాగునీటి సరఫరా పనులు, ఆర్ అండ్ బీ అతిథి గృహం, కార్యాలయ భవనం నిర్మాణానికి, ఎన్జీ కళాశాలలో రూ.36 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు ప్రగతి నివేదన సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు యువత, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ మాట్లాడుతూ నల్లగొండలో ఐటీ హబ్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, ఆర్ అండ్ బీ ఈఈ నరేందర్‌రెడ్డి, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ఐటీ హబ్‌లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పేద విద్యార్థినులకు బాసట



ఈ ఫొటోలో కనిపిస్తున్న అమ్మాయి పేరు బత్తుల అఖిల. ఈ అమ్మాయిది నాగార్జునసాగర్. ఈ అమ్మాయి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో వాళ్ల అమ్మమ్మ వద్ద ఉంటోంది. అందరిలాగే తనకు ఇంగ్లిష్ మీడియం చదవాలని కోరిక. ఐదో తరగతి వరకు వాళ్ల అమ్మమ్మ తాతయ్య నాగార్జున సాగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివించారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువు బంద్ చేయించారు. తర్వాత తిరుమలగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేజీబీవీలో ఇంగ్లిష్ మీడియం ఉండడంతో ఆరో తరగతిలో చేరి ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. ఒక్క అఖిలనే కాదు ఎంతో మంది పేద విద్యార్థులకు కేజీబీవీలు బాసటగా నిలుస్తున్నాయి. ఒక్క తిరుమలగిరి కేజీబీవీలోనే తల్లిదండ్రులు లేని విద్యార్థినులు 15 మంది విద్యనభ్యసిస్తున్నారు.



గుర్రంపోడులోని కేజీబీవీ భవనం

- కేజీబీవీల్లో ఇంగ్లిష్ మీడియం బోధన.. సకల సదుపాయాలు
- 27 విద్యాలయాల్లో ఏడు వేల మందికి అందుతున్న విద్య
- అంతటా ఇంటర్ వరకు బోధించాలని డిమాండ్



దామరచర్ల కేజీబీవీలో విద్యార్థినులకు విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయిని

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : చదువుకోవాలని ఆసక్తి ఉన్నా కొందరికి కుటుంబ పరిస్థితులు అనుకూలించవు. మరికొందరికి ఆర్థిక స్థోమత ఉండదు. దీంతో కొందరు బాలికలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఇలా చదువుకు దూరమైన బాలికలకు విద్యనందించాలనే సంకల్పంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాయాలు (కేజీబీవీ) ఏర్పాటు చేశారు. వాటిలో ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతోంది. దీంతోపాటు చక్కటి వసతి కల్పిస్తుండడంతో పేద విద్యార్థినులకు ఒక వరలా మారింది.

సీట్లకు పెరిగిన డిమాండ్

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఐదు మండలాల్లో 2017లో ప్రభుత్వం నూతనంగా కేజీబీవీలను ఏర్పాటు చేసింది. ప్రారంభ నుంచే వాటిల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అన్ని కేజీబీవీల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో మిగతా 22 కేజీబీవీల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన సాగుతోంది. వసతి కూడా ఉండడంతో కేజీబీవీల్లో సీట్లకు కూడా డిమాండ్ ఉంటోంది. 2017 సంవత్సరంలో 80 మందితో ప్రారంభమైన తిరుమలగిరి కేజీబీవీలో నేడు 240 మంది విద్యార్థినులు విద్యనభ్యస్తున్నారు. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు అంటే కేజీబీవీలు పేద విద్యార్థినులకు ఎంతగా ఉపయోగపడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్ నుంచి వచ్చిన



మాది హైయత్‌నగర్ పక్కన ముగ్ననూరు. నిరుపేద కుటుంబమైన మాకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివే స్థోమత లేదు. మా బంధువుల ద్వారా తిరుమలగిరి వచ్చి ఇక్కడ చదువుతున్న. పాఠశాలలో బోధన బాగుంది. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో బాగా చదువుకుంటా.

– అమూల్య, విద్యార్థిని, తిరుమలగిరి

అన్ని వసతులు కల్పిస్తున్నాం



ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మధ్యలో చదువు మానేసిన విద్యార్థినులకు కస్తూర్బా విద్యాలయాలు బాసటగా ఉంటున్నాయి. బాలికలు ఉన్నత విద్యవైపు అడుగులు వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మంచి విద్య, క్రమశిక్షణతో పాటు ఆహారం, ఆరోగ్యం విషయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– సరిత, జీసీడీఓ, నల్లగొండ

14 విద్యాలయాల్లోనే ఇంటర్మీడియట్..

జిల్లాలోని మొత్తం 27 కేజీబీవీల్లో సుమారు ఏడు వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 27 పాఠశాలల్లో అందులో 14 పాఠశాలల్లోనే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన ఉంది. మిగతా 13 విద్యాలయాల్లో పదో తరగతి వరకు మాత్రమే ఉంది. దీంతో ఆ విద్యార్థినులు ఇంటర్మీడియట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందులోని కొందరు విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ఆలోచన చేసి మిగతా 14 పాఠశాలల్లో కూడా ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లి కారుబోల్తా



హైవే వెంట పొలాల్లో బోల్తాపడిన కారు

అర్వపల్లి: నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి జాజిరెడ్డిగూడెం మీదుగా మద్దిరాలకు వెళ్తున్న కారు అర్వపల్లి శివారులో అదుపుతప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి వాహనంలో నుంచి దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బోల్తా పడిన కారును స్థానికులు ట్రాక్టర్‌తో బయటికి తీశారు. 365, 365బీ హైవేలపై తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహస్యంగా మృతదేహం పూడ్చివేత

మృతదేహాన్ని బ్యాగులో కుక్కి.. కారులో తీసుకొచ్చి..

- అర్ధరాత్రి నల్లగొండ శివారు ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువభాగాన అంతిమ సంస్కారాలు
- గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేయడంపై అనుమానాలు



మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశం

నల్లగొండ క్రైం : దుండగులు అర్ధరాత్రి ఓ మృతదేహానికి రహస్యంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన నీలగిరి మున్సిపాలిటీ పరిధి చందనపల్లి శివారు చెత్త డంపింగ్ యార్డు సమీపంలో పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో జరిగింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా.. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి 11:30 గంటలకు కారులో నలుగురు, మూడు బైక్‌లపై మరో ఆరుగురు వ్యక్తులు చందనపల్లి చెత్త డంపింగ్ యార్డు సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువ ప్రాంతానికి వచ్చారు. వాహనాలను అక్కడే నిలిపి తమ వెంట తెచ్చుకున్న పలుగు, పారలతో సుమారు 4 నుంచి 5 ఫీట్ల పొడవులో గొయ్యి తీశారు. ప్యాకెట్లలో తీసుకొచ్చిన ఉప్పు గొయ్యిలో పోశారు. అనంతరం బ్యాగులో కుక్కి కారులో తీసుకొచ్చిన మృతదేహాన్ని బయటికి తీశారు. ఇద్దరు వ్యక్తులు సదరు మృతదేహం కాళ్లు ఒకరు, చేతులు మరొకరు పట్టుకుని గోతిలో పెట్టి పూడ్చిపెట్టారు. ఈ క్రమంలో వెంట వచ్చిన ఒకరు పెద్ద పెట్టున రోదించగా మిగతా వారు అతడిని వారించారు. అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత అందరూ ఆయా వాహనాల్లో అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిసింది.

ఆ.. మృతదేహం ఎవరిది?

గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేసిన మృతదేహం ఎవరిదనేది చందనపల్లి గ్రామంలో చర్చ జరుగుతోంది. గొయ్యి పొడవు 4 నుంచి 5 ఫీట్ల లోపే ఉండడంతో ఆ మృతదేహం 6 నుంచి ఏడేళ్ల లోపు వారిదే ఉంటుందని తెలుస్తోంది. మృతదేహం ఆడ, మగ అనేది స్పష్టత లేదని అర్ధరాత్రి చాటుగా గమనించిన వారు పేర్కొంటున్నారు. ఏదైనా అనారోగ్యంతో మృతిచెందితే నిర్భయంగా అంత్యక్రియలు చేస్తారు. మహిళలు ఎవరు లేకుండా, అర్ధరాత్రి బ్యాగులో మృతదేహాన్ని తీసుకొచ్చి ఖననం చేయడంతో ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి పూడ్చిపెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం అష్టమి కావడంతో నరబలి ఇచ్చిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారనే అనుమానాలు లేకపోలేదు. అర్ధరాత్రి అంతిమ సంస్కారాల తంతును గమనించిన కొందరు చందనపల్లి గ్రామస్తులకు విషయం తెలపడంతో చర్చనీయాంశంగా మారింది.

ఆదర్శ యువజన మండలి ఆధ్వర్యంలో..

- మాసాయిపేటలో 48ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు



మాసాయిపేటలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఆదర్శ యువజన మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో 48 ఏళ్ల నుంచి గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1975 సంవత్సరంలో 400 మందితో సుభాష్ యూత్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1998లో ఆదర్శ యువజన మండలిగా పేరు మార్చారు. గ్రామంలో ఒక్కటే వినాయకుని మండపం ఉండడంతో అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకునేవారు. 2000 సంవత్సరంలో కొంత మంది వేరుకావడంతో ప్రస్తుతం 200మంది సభ్యులతో ఆదర్శ యువజన మండలి ముందుకు కొనసాగుతోంది.

సేవా కార్యక్రమాలు

మాసాయిపేట గ్రామంలో 1990కి ముందు వినాయకుని మండపం వద్ద నాటకాలు వేయించేవారు. అదేవిధంగా పిల్లలకు ప్రత్యేకమైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. దీంతో పాటు గ్రామంలో క్లబ్ తరఫున సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పాఠశాలలో కావాల్సిన వసతులు తెలుసుకుని సహాయం చేసేవారు.

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం



ఆదర్శ యువజన మండలి యూత్ తరఫున సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. 2000 –05 వరకు అధ్యక్షుడిగా పనిచేసాను. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవాల కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాం.

– ఇరిటెపు శ్రీనివాస్, యూత్ కన్వీనర్

ఆదర్శంగా ఉంటాం



మా యూత్ ద్వారా వినాయక మండపాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తూ, ఇతరులకు ఆదర్శంగా ఉంటున్నాం. అందరికంటే భిన్నంగా, కల్చరల్, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతాము. గ్రామస్తుల నుంచి సహకారం లభిస్తుంది.

– కటకం శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు

పీఏపల్లిలో పట్టపగలే చోరీ

- రూ.5లక్షల నగదు, 5తులాల బంగారం అపహరణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ గిరిబాబు



చిందరవందరగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు

పెద్దఅడిశర్లపల్లి : పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.5లక్షల నగదుతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పీఏపల్లికి చెందిన వంగాల లక్ష్మారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మారెడ్డి తన బంధువులను పరామర్శించేందుకు ఆదివారం ఉదయం 9గంటలకు ఇంటికి తాళం వేసి తన భార్యతో కలసి నేరేడుచర్లకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. లక్ష్మారెడ్డి తన కుమారుడి విదేశీ విద్య నిమిత్తం బీరువాలో దాచిన రూ.5లక్షలతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధం

- రూ.75 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధమైంది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బీబీగూడెం శివారులోని అక్షిత ట్రేడర్స్ కూల్‌డ్రింక్స్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు సూర్యాపేటలో ఉంటున్న యాజమాని జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. విషయం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు చల్లార్చారు. అప్పటికే గోదాములో ఉన్న కూల్‌డ్రింక్స్‌తో పాటు గోదాము దగ్ధమైందని యాజమాని తెలిపాడు. ఈ ప్రమాదంలో రూ.75 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు వాపోయాడు. గోదాం యాజమాని జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రవీందర్ (ఫైల్)

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన కర్ణకంటి రవీందర్ (50) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామంలో శనివారం కార్పెంటర్ పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకుని భువనగిరికి వచ్చేందుకు పగిడిపల్లిలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికసాయం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కోర్టులో పనిచేస్తూ మృతిచెందిన ఎస్.యాదయ్య, ఎండీ.యూసుఫ్ అలీ కుటుంబాలకు తెలంగాణ డిస్ట్రిక్ జ్యుడీషియల్ ఎంప్లాయిస్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ తరఫున రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నల్లగొండ కోర్టులో ఆదివారం నిర్వహించిన సొసైటీ 25వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం బాధిత కుటుంబాలకు సభ్యులు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినోద్‌కుమార్, కార్యదర్శి టి.విజయ్‌కుమార్, కోశాధికారి కె. యాదగిరి, జ్యుడీషియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎం.వీరబాబు, డి.మదుసూదన్‌రావు, కె.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం

- విద్యుదాఘాతంతో ఏడేళ్ల బాలుడు మృతి
- తుర్కపల్లి మండల పరిధిలో ఘటన



ఆదిత్య మృతదేహం

తుర్కపల్లి: గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. ఏకదంతుడికి పూజలు నిర్వహించేందుకు తల్లిదండ్రులతో కలసి వెళ్లిన ఏడేళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం దత్తాయపల్లికి చెందిన జిట్టా రాజు, మహాలక్ష్మీ దంపతులు తమ కుమారుడు ఆదిత్య (7), కూతురితో కలసి గ్రామంలో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహానికి పూజలు నిర్వహించేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. తల్లిదండ్రులు మండపం వద్ద ఉండగా ఆదిత్య, దాని ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లాడు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఇనుప చువ్వలు పట్టుకుని ఎక్కేందుకు ప్రయత్నించాడు. అప్పటికే ఆ ఇనుప చువ్వలకు గణేశ్ మండపానికి విద్యుత్ సరఫరా అవుతున్న వైరు తగిలి ఉంది. ఆదిత్య ఆ చువ్వలను పట్టుకోగానే విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదిత్య మృతితో దత్తాయపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నాగారం పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం వాహనంతో పోలీసులు

నాగారం : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం ఫణిగిరి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని చందులాల్ తండాకు చెందిన దేవుసోత్ రెడ్యా, పచ్చలబోడు తండాకు చెందిన గుగులోతు అనిల్ నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని టాటాఏస్ వాహనంలో హైదరాబాద్ వైపు తరలిస్తుండగా ఫణిగిరి స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని, టాటాఏస్ వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు : పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అడ్డగూడూరు మండలంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుండాల మండలం బండ కొత్తపల్లి గ్రామానికి చెందిన ననుబాల యాదగిరి కూతురు మంజుల(32)కు అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన ననూబోతు మహేష్‌తో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. బండకొత్తపల్లికి చెందిన మంజుల తమ్ముడు భిక్షంకు జానకీపురం గ్రామానికి చెందిన అనూషతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి వివాహానికి మహేష్, మంజుల మధ్యవర్తిత్వం వహించారు. అయితే, కొంత కాలంగా భిక్షం, అనూష దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో అనూష పుట్టింటికి వచ్చింది. అనూష కుటుంబ సభ్యులు భిక్షం తీరుపై మహేష్, మంజులను నిలదీశారు. భిక్షం వైఖరి కారణంగా మహేష్, మంజుల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మంజుల శనివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న మంజులను కొద్ది సేపటి తర్వాత భర్త గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘమిత్ర బ్యాంకు చైర్మన్ సంగం రామకృష్ణ

- సంఘమిత్ర బ్యాంకు చైర్మన్ సంగం రామకృష్ణ

నల్లగొండ టౌన్ : రెండు దశాబ్దాలకు పైగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో సంఘమిత్ర బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆ బ్యాంకు ఫౌండర్, చైర్మన్ సంగం రామకృష్ణ పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన బ్యాంకు 50వ మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖాతాదారుల సేవయే పరమావధిగా పనిచేస్తూ ప్రతి సంవత్సరం బ్యాంకు లాభాల బాటలో పయనిస్తుందని తెలిపారు. 1,061మంది వాటాదారులతో రూ.132.17 లక్షల వాటాదనం కలిగి ఉందన్నారు. 2,991 డిపాజిట్ దారులతో రూ.76.40 కోట్ల డిపాజిట్‌లు సేకరించామని తెలిపారు. బ్యాంకులో మొత్తం 43,968 మంది ఖాతాదారులతో రూ.138.22 కోట్ల వ్యాపారం సాగుతోందని ఆయన వివరించారు. పెట్టుబడులు రూ.19.08 కోట్లు, రిజర్వులు రూ.6.86 కోట్లు, లాభాలు రూ.1.44 కోట్లు కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. 25సంవత్సరాలుగా బ్యాంకు అభ్యున్నతికి సహకరిస్తున్న ఖాతాదారులు, వాటాదారులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, బ్యాంకు వైస్ చైర్మన్‌లు ఎంవీ రాఘవరావు, పల్లాటి శైలజ, డైరెక్టర్లు పున్నచండీకేశ్వర్, వి.సుగుణ, జి.వెంకటేశ్వర్లు, ఎ.లక్ష్మయ్య, ఎం.వెంకట్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, మహ్మద్‌షరీఫ్, బ్యాంకు సీఈఓ నజీరుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు జేవీఆర్

- మంత్రి కేటీఆర్‌కు వైఎస్సార్‌టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జేవీఆర్ వినతి


హుజూర్‌నగర్: నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని వైఎస్సార్ టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం, వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతుల పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. రైతులు నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నందున సాగు, తాగు నీటిని అందించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయించి అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జేవీఆర్ వివరించారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం శ్రీస్వామివారికి ఆరాధన, నిజాభిషేకం, అర్చన గావించారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

వరిలో ఆకు ఎండు తెగులు

- రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు



డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : ఉమ్మడి జిల్లాలో బోర్లు, బావులు, ఇతర సాగు నీటి వనరుల ద్వారా సాగు చేసిన వరి పంటకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బ్యాక్టీరియా సోకడంతో ఆకు ఎండు తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు రైతులు తక్షణమే యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగాం కోఆర్డి నేటర్ డాక్టర్ శ్రీనివాస రావు సూచిస్తున్నారు.

తెగులు సోకడానికి కారణాలు

సెప్టెంబర్–అక్టోబర్ నెలలో మబ్బులతో కూడిన వాతావరణం, రెండు నుంచి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు తదితర పరిస్థితులు వరిలో ఆకు ఎండు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఆకు ఎండు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తుంది.



త్రిపురారం : ఆకు ఎండు తెగులు సోకిన వరి పొలం



తెగులును గుర్తించే విధానం

వరి పంటలో ఆకు ఎండు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయకూడదు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు (లేదా) పోషామైసిన్ (లేదా) స్ట్రెప్లోసైక్లిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.